సాక్షి
పెద్దపల్లి

శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023

## అల్పాహారంతో విద్యార్థుల్లో ఏకాగ్రత



కాల్వశ్రీరాంపూర్/ఓదెల: తెలంగాణ సర్కార్ ఏర్పాటు చేసిన అల్పాహారం కార్యక్రమంతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెంపొందుతుందని డీఈవో మాదవి అన్నారు. గురువారం కాల్వశ్రీరాంపూర్ మండలంలోని గంగారం జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, ఓదెల మండలంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈవో రాజయ్య, హెచ్ఎంలు మల్లారెడ్డి, హరికృష్ణ, పద్మ, సీఆర్పీలు కుమార్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న జడ్జి భారతి

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంథని సీనియర్ సివిల్ జడ్జి భారతి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పోక్సో, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. కార్యక్రమంలో మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి శయేందర్‌రెడ్డి, క్రీడా కార్యదర్శి కట్కం శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యుడు బొట్ల ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ సునంద, సర్పంచ్ ఆకుల ఓదెలు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంకండి



మాట్లాడుతున్న శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: ధాన్యం కొనుగోళ్లకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై గురువారం కలెక్టరేట్‌లో అధికారులు, రవాణా కాంట్రాక్టర్లు, రైస్‌మిల్లర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలుండేలా కొనుగోళ్లు నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ (పౌరసరఫరాశాఖ) నుంచి కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేయాలన్నారు. కేటాయించని మిల్లులకు ధాన్యం సరఫరా చేసినట్టు దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలుంటాయని పేర్కొన్నారు. మిల్లర్లు లారీల నుంచి ధాన్యం దిగుమతిలో జాప్యం చేయొద్దన్నారు. కాంట్రాక్టర్లు ప్రతీ కేంద్రానికి అవసరమైన లారీలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఆర్‌డీవో శ్రీధర్, డీసీవో శ్రీమాల, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, డీఏవో ఆదిరెడ్డి తదితరులున్నారు.

### ఆయిల్‌పాంతో రెండింతల ఆదాయం



అవగాహన కల్పిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

జూలపల్లి(పెద్దపల్లి): రెండింతల ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పాం పంటను రైతులు సాగు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వడ్కాపూర్ క్లస్టర్ పరిధిలోని రైతులకు ఆయిల్‌పాం సాగు, ప్రాముఖ్యత, మెలకువలపై గురువారం అవగాహన కార్యక్రయం నిర్వహించారు. మొక్కల మధ్య అంతర పంటలు సాగు చేయొచ్చని, మూడేళ్ల తర్వాత ఆయిల్‌పాంతో పాటు అంతర పంటలుగా మిరియాలు, కోకో, వెనీలా, తమలపాకు వంటి తీగజాతి పంటలు వేయవచ్చని, షెడ్ కింద సాగు చేసే పంటలు వేసుకొని రెండింతల ఆదాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏవో ప్రత్యూష, హార్టికల్చర్ అధికారి జ్యోతి, తిరుమల ఆయిల్ కెమ్ ఇండస్ట్రీ సీఈవో కేశవ్, ఎఫ్‌పీవో సీఈవో రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక సంక్షేమానికి ఏం చేస్తారో చెప్పాలి



మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన రాజకీయపార్టీలన్నీ కార్మిక సంక్షేమానికి ఏం చేస్తాయో తమతమ మేనిఫెస్టోలో చెప్పాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. గురువారం పెద్దపల్లిలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో డీసీఎల్ అధికారిని నియమించాల్సి ఉందని పేర్కొన్నారు. గోదావరిఖనిలో 100పడకలతో ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని, కార్మికులకు చట్టప్రకారం వేతనాలందేలా చూడాలన్నారు. ట్రాన్స్‌పోర్టు, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో నాయకులు కుమారస్వామి, అశోక్, కొమురయ్య, జ్యోతి, రామాచారి, అరవింద్, వెంకటస్వామి తదితరులున్నారు.

# ఇక్కడి పైసలు ఇక్కడ్నే ఖర్చుచేయాలే

- కార్మిక డిక్లరేషన్ చేస్తేనే మద్దతు
- డీఎంఎఫ్‌టీ నిధులతో అభివృద్ధి చేయాలి
- స్పష్టత ఇవ్వకపోతే నోటాకే ఓటు
- కోలిండియాలో లేని హక్కులు స్వరాష్ట్రంలో సిద్ధించాయి
- 'సాక్షి చర్చావేదిక'లో సింగరేణి కార్మిక సంఘాల నాయకులు



సాక్షి డిబేట్

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించాలని కార్మిక సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. ఏ పార్టీలు తమ డిమాండ్లకు పెద్ద పీట వేస్తాయో.. వాటికే తాము మద్దతు పలుకుతామని తేల్చిచెప్పారు. సింగరేణి కార్మికుల ఎజెండాపై గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన 'సాక్షి చర్చావేదిక'లో అన్ని గుర్తింపు, జాతీయ, విప్లవ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపేలా నాయకులు తమ ఆలోచనలను పంచుకున్నారు.

– సాక్షిప్రతినిధి,కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి /గోదావరిఖని

### హామీలతో మభ్యపెట్టవద్దు



మహిళ, బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ మాదిరిగా సింగరేణి కార్మికులకు అన్ని పార్టీలు డిక్లరేషన్ ప్రకటించాలి. తమ తమ మేనిఫెస్టోల్లో కార్మికుల సమస్యలను చేర్చాలి. ఓట్ల కోసం హామీలతో మభ్యపెట్టవద్దు. డిమాండ్స్‌పై స్పష్టత లేకపోతే నోటాకే ఓటు.

– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్

### వయోపరిమితి పెంచాలి



సింగరేణి కార్మికుల సంఖ్య 1.16 లక్షల నుంచి 39 వేలకు పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిలో కొత్తగా ఇచ్చామంటున్న ఉద్యోగాలు ఎక్కడికి పోయాయి? రెండు పేర్లతో పనిచేస్తున్నావారి సమస్య పరిష్కరించాలి. వారసత్వ ఉద్యోగాల వయోపరిమితి 40 ఏళ్లకు పెంచాలి.

– కె.విశ్వానాథ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

### 2, 3 నెలల జీతం పన్నుకే



తెలంగాణ ఉద్యమ సమయంలో పాలక పార్టీ 50 వేల మందికి కొత్తగా ఉద్యోగాలు కల్పిస్తాం, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తాం, బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పుతామని చెప్పి, మరిచింది. 2, 3 నెలల జీతం ఆదాయ పన్నుకే పోతోంది.

– టి.శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చావేదికలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

### చట్ట సవరణ చేయాలి



ప్రధాని మోదీ సింగరేణిని కార్పొరేట్ కంపెనీలపరం చేస్తున్నారు. గతంలో ఇందిరాగాంధీ బొగ్గు గనులకు జాతీయం చేయడంతో సుమారు 6 లక్షల మంది కార్మికులకు లాభం చేకూరింది. ఆదాయ పన్ను మాఫీ లేదా స్లాబ్ పెంపు అమలుకు చట్టసవరణ చేయాలి.

– జనక్‌ప్రసాద్, సెక్రటరీ జనరల్, ఐఎన్‌టీయూసీ

### కాంగ్రెస్ వల్లే తెరపైకి ప్రైవేటీకరణ



గత కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతోనే ఇప్పుడు బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. కార్మికుల హక్కుల సాధనలో బీఎంఎస్ రాజీలేని పోరాటం చేస్తోంది. 11వ వేతన ఒప్పందం కోసం అహర్నిశలు కృషి చేసింది.

– యాదగిరి సత్తయ్య, బీఎంఎస్ అధ్యక్షుడు

### బినామీ పేర్లను సవరించాలి



సింగరేణిలో బినామీ పేర్లతో పని చేస్తున్న కార్మికుల పేర్లను సవరించాలి. గోదావరితీరంలో ఉన్నా స్వచ్ఛమైన తాగు నీరందక కార్మిక కుటుంబాలు ఆస్పత్రుల పాలవుతున్నాయి. కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, కార్పొరేట్ వైద్యం అందించాలి.

– తుమ్మల రాజారెడ్డి, సీఐటీయూ అధ్యక్షుడు

### రాజకీయ జోక్యం పెరిగింది



సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగింది. కార్మిక సంఘాల ఉనికి పూర్తిగా తగ్గిపోయింది. మారుపేర్ల మార్పు రెగ్యులరైజ్ చేయాలి. కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలి. నాలుగు బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించాలి.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

### ఆదాయ పన్ను మినహాయించాలి



సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినప్పటికీ కేంద్రం పార్లమెంట్‌లో ఆమోదించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం, టీబీజీకేఎస్ నిరంతరం కార్మికుల కోసం పని చేస్తున్నాయి.

– కెంగర్ల మల్లయ్య, టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

### పరిశ్రమలు నెలకొల్పాలి



సింగరేణి మనుగడను కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను బిచ్చగాళ్లుగా మారుస్తోంది. కేంద్రం బ్లాక్‌లను వేలం వేస్తే రాష్ట్ర సర్కారు కొని, సింగరేణికి కేటాయించాలి. బొగ్గు ఆధారిత పరిశ్రమలను నెలకొల్పాలి.

– జి.రాములు, ఏఐఎఫ్‌టీయూ నేత

### ప్రభావిత ప్రాంతాల్లో వసతులేవి?



సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ నిధులను సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్లో వెచ్చిస్తున్నారు. బొందల గడ్డగా మారుతున్న ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడం లేదు. సంస్థలో రాజకీయ జోక్యం పెరిగింది.

– రాజన్న, సింగరేణి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు


## ఓటర్లను చైతన్య పరచాలి



కళాకారులతో ఈఆర్‌వో అరుణశ్రీ

జ్యోతినగర్(రామగుండం): తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులతో రామగుండం నియోజకవర్గంలో ఓటర్లను చైతన్యపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ పేర్కొన్నారు. గురువారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ జెడ్పీ హైస్కూల్‌లో కళాకారులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకోవడం, ఓటింగ్ శాతం పెంచడానికి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. నియోజవర్గంలోని అర్బన్, రూరల్ ప్రాంతాల్లో కళాజాత ప్రదర్శనలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో కళాకారులు ఈదునూరి పద్మ, దయా నర్సింగ్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

## గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కాంగ్రెస్‌లో చేరినవారితో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

ముత్తారం(మంథని): కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గురువారం ముత్తారం మండలం మచ్చుపేటలో బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరిక సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోతో పాటు తాము నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని ప్రతీ గడపకు తెలియజేయాలన్నారు. డబ్బు, అధికార అహంకారంతో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ వారిని కొనుగోలు చేయడమే కాకుండా ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ఆలోచనలో ఉన్నారని విమర్శించారు. బీఆర్ఎస్ బెదిరింపులు, ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని మచ్చుపేట, కేశనపల్లి, హరిపురం, ముత్తారం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మచ్చుపేట, మైదంబండలో ఇటీవల మరణించిన, అనారోగ్య బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, ముత్తారం సర్పంచ్ తూటి రజితరఫీ, మాజీ సర్పంచ్ గోవిందుల పద్మఆనంద్, నాయకులు మద్దెల రాజయ్య, బియ్యాని శివకుమార్, తాళ్లపల్లి కుమారస్వామి, జంగ మోహన్‌రెడ్డి, రజాక్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఫిర్యాదులపై స్పందించాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్



సూచనలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ఎన్నికల నేపథ్యంలో ఉల్లంఘనలు, ఇతర విషయాలపై అందే ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రాన్ని గురువారం సందర్శించి ఎన్నికల అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఫిర్యాదు కేంద్రానికి జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డిని నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. సీ-విజిల్ యాప్, జాతీయ గ్రీవెన్స్ సెల్, సామాజిక మాధ్యమాలు, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్‌తో పాటు 1950 టోల్‌ఫ్రీ నంబరు నుంచి వచ్చే ఫిర్యాదులను గుర్తించిన వెంటనే నోడల్‌అధికారి ద్వారా క్షేత్రస్థాయి బృందాలకు సమాచారం అందించాలన్నారు. ఆ బృందాలు ఫిర్యాదుపై విచారణ జరిపి సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల వారీగా పని చేసే ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలైన్స్, వీడియో సర్వేలైన్స్ బృందాల వివరాలను జిల్లా ఎన్నికల ఫిర్యాదు కార్యాలయ నోటీస్ బోర్డుపై ఉంచాలన్నారు.

**ఎలక్ట్రానిక్, సోషల్‌మీడియాపై నజర్**

రాజకీయపార్టీల నేతలు అనుమతి లేకుండా ర్యాలీలు తీయడం, గడువు ముగిసినా ప్రచారం చేయడం, డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నట్లు తేలినా ఆయా ఘటనల వివరాలను నోడల్ అధికారి ద్వారా రిటర్నింగ్ అధికారికి సమాచారమందించాలన్నారు. సోషల్‌మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు చేసినా సత్వరం స్పందించాలని సూచించారు. జిల్లా ఉపాధి అధికారి తిరుపతిరావు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మెహరాజ్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ పాల్గొన్నారు.

## కేసీఆర్‌తోనే సింగరేణి మనుగడ

- రామగుండం ఎమ్మెల్యే చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికుల మనుగడ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పేర్కొన్నారు. గురువారం జీడీకే–2వ గనిపై నిర్వహించిన ప్రజా అంకితయాత్రలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించింది బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటేనే సింగరేణి సంస్థకు మనుగడ సాధ్యమన్నారు. సకల జనుల సమ్మె కాలంలో కార్మికుల వేతనాల్లో కోత విధించవద్దని తాను అసెంబ్లీలో సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో వేతనంతో పాటు తెలంగాణ ఇంక్రిమెంట్ మంజూరు చేసిన గొప్పనేత కేసీఆర్ అన్నారు. సింగరేణి కార్మికులకు ఐటి నుంచి మినహాయింపు ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా కేంద్రం ఆమోదించలేదని, మళ్లీ అధికారంలోకి రాగానే కేంద్రం మెడలు వంచైనా ఐటీ రద్దుకు కృషి చేస్తామన్నారు. ఈప్రాంత యువతకు ఉపాధి కల్పన కోసం రూ.30కోట్లతో ఐటీ పార్కు, స్పిన్నింగ్ మిల్ స్థానంలో అంతర్గాంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని వివరించారు. డ్యూటీకి వెళ్లేందుకు అడ్డంకిగా ఉన్న జీడీకే–2ఇంక్లయిన్ మోరీ విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణానికి సంస్థ సీఎండీ శ్రీధర్‌తో మంత్రి కేటీఆర్ మాట్లాడారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కెంగర్ల మల్లయ్య, నూనె కొమురయ్య, గండ్ర దామోదర్‌రావు, మాదాసు రామమూర్తి, స్వామి, జహిద్‌పాషా, శేషగిరి, మండ రమేశ్, పోలాడి శ్రీనివాస్‌రావు, వడ్డెపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీ-థర్మల్‌ను మూసివేసేందుకు కుట్ర

- డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్



బీ-థర్మల్ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఠాకూర్, నాయకులు

రామగుండం: ఏదో కారణం చూపించి రామగుండం బీ–థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని మూసివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్‌ఠాకూర్ ఆరోపించారు. ఇటీవల అధికారుల నిర్లక్ష్యంతోనే కేంద్రం మంటలకు ఆహుతైందని, ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం కేంద్రాన్ని సందర్శించేందుకు ప్రవేశద్వారం వద్దకు చేరుకోగా భద్రతా సిబ్బంది లోనికి అనుమతించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన విషయాలు తెలుసుకునేందుకు ఎందుకు అనుమతించరంటూ ప్రశ్నించడంతో 20 నిమిషాల తర్వాత ఎట్టకేలకు అనుమతించారు. కేంద్రంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ విజేందర్‌ను కలిసి ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఈ ఈసందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ, భారీగా మంటలు అంటుకున్న విషయంపై అధికారులు గోప్యంగా వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోందన్నారు. త్యాగాలతో నిర్మించుకున్న విద్యుత్ కేంద్రాన్ని కాపాడుకునే బాధ్యత తమపై ఉందన్నారు. ఇప్పటికే సీఎండీ ప్రభాకర్‌రావును కలిసి నూతన విద్యుత్ కేంద్రం స్థాపన విషయంలో ఆయన సానుకూలంగా స్పందించినా ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే ప్రకృతికి విరుద్ధంగా చేపట్టిన మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తక్షణమే స్థానిక వనరుల లభ్యతతో నూతన విద్యుత్ కేంద్రం స్థాపించేందుకు కృషి చేస్తానని, తన చివరి శ్వాస ఉన్నంత వరకు పరిశ్రమను నెలకొల్పుతానని ఉద్వేగంతో మాట్లాడారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### మీకు తెలుసా?



బలాలు.. బలహీనతలు నాయకులకు తెలుసు. మంచి నాయకుడు బలహీనతలు వదిలేస్తాడు. బలాలను పెంచుకుంటాడు.

– వారెన్ బెన్నిస్



## ఓటు.. రకాలు

కరీంనగర్ అర్బన్: ఓటు వినియోగం సాధారణంగా అందరికీ ఒకే మాదిరిగా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేర్లతో పిలుస్తారు. ఓటు వేసే సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని ఓట్లను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. అంధులకు, చాలెంజ్, టెండర్, సర్వీస్ ఓటు ఇలా వినియోగించే అవకాశముంది.

**టెండర్ ఓటు :** ఎవరైనా వ్యక్తి ఓటు వేయడానికి వచ్చినప్పుడు అతడి ఓటు ఇంతకుముందే మరొకరు వేసినట్లయితే ప్రిసైడింగ్ అధికారి అతడికి బ్యాలెట్ ఓటు ఇచ్చి వేయించాలి. దీన్ని టెండర్ ఓటుగా పిలుస్తారు. ఈ సమాచారాన్ని ఫారం–17బీలో నమోదు చేయాలి.

**సర్వీస్ ఓటు:** ఎవరైనా సర్వీసు ఓటర్లు తమకు సంబంధించిన వ్యక్తుల ద్వారా ఓటు వేయడానికి ఎన్నికల అధికారుల ద్వారా ముందస్తు అనుమతి తీసుకుంటే వారి పేర్లు క్లాసిఫైడ్ సర్వీస్ ఓటరు లిస్ట్‌లో ఉంటుంది. అలాంటి వ్యక్తి ఓటు వేయడానికి వస్తే జాబితాలో చూసుకుని సాధారణ ఓటరు మాదిరి అతడికి ఓటు హక్కు కల్పిస్తారు.

**చాలెంజ్ ఓటు:** ఓటరు ఎవరైనా ఓటు వేయడానికి వచ్చినప్పుడు ఎన్నికల ఏజెంట్లు ఆ ఓటరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తే సంబంధిత ఎన్నికల అధికారి ఫిర్యాదు చేసిన వ్యక్తి నుంచి రూ.2 రుసుం తీసుకుని రసీదు ఇస్తారు. వచ్చిన ఓటరు నిజమైనవారా, కాదా అని విచారిస్తారు. నిజమైన వారని తేలితే అతడికి ఓటు హక్కు కల్పించి రూ.2 రుసుంను జప్తు చేస్తారు. అతను నిజమైన వారు కాదని తేలితే ఓటరు నుంచి రూ.2 తీసుకుని ఏజెంట్‌కు అందించి ఓటు వేసేందుకు అనర్హుడిగా ప్రకటిస్తారు.

**ఈడీసీ ఓటు:** ఎన్నికల సిబ్బంది ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ) కలిగి ఉంటే అతడి వివరాలు మార్క్‌డ్ కాపీలో చివర నమోదు చేస్తారు. సాధారణ ఓటరు మాదిరి ఓటింగ్ సౌకర్యం కల్పిస్తారు.

**టెస్ట్:** ఓటరు ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్ నుంచి వచ్చే స్లిప్‌లో తాను ఓటు వేసిన వ్యక్తికి పడలేదని తెలిపితే రాత పూర్వకంగా ఫిర్యాదు తీసుకుంటారు. అతనికి మరోసారి బ్యాలెట్ ఇస్తారు. ఓటు వేసేందుకు మరోసారి వెళ్లేటప్పుడు అతనితోపాటు పోలింగ్ ఏజెంట్‌ను తీసుకెళ్లి వారి సమక్షంలో ఓటు వేయిస్తారు. వేసిన ఓటుకు వచ్చిన స్లిప్పు తేడా ఉంటే ఆర్‌వోకు సమాచారం ఇచ్చి ఓటింగ్ ప్రక్రియ నిలిపివేస్తారు. వేసిన ఓటుకు వీవీప్యాట్‌లో వచ్చిన స్లిప్‌కు తేడా లేకుంటే ఆ సమాచారాన్ని 17 సీలో నమోదు చేయడంతోపాటు ఏ అభ్యర్థికి ఓటు రికార్డు చేశారనే విషయాన్ని స్పష్టంగా రాస్తారు.

**నాట్ టు ఓటు:** ఒక వ్యక్తి పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించి బ్యాలెట్ ఇచ్చిన తర్వాత ఓటు వేయనని అంటే అతని కోరిక మేరకు పీవో అతడిని బయటకు పంపిస్తారు. నాట్–టు–ఓటు అని రాసి ఆ ఓటును వేరే ఓటరుకు ఇస్తారు.



సమాజంలో రెండు వర్గాలు ఉంటాయి. ఒక వర్గం పనిచేసే వారైతే.. మరొక వర్గం పేరు కోసం తపించేవారు. మొదటి వర్గం వైపు ఉండడం ఉత్తమం.

– ఇందిరాగాంధీ

## క్లుప్తంగా

### పాముకాటుతో రైతు మృతి


నర్సింగం(ఫైల్)

జూలపల్లి: అబ్బాపూర్ శివారు గ్రామం నిమ్మపల్లిలో పాముకాటు వేయడంతో రైతు చొప్పరి నర్సింగం (42) మృతిచెందాడు. బుధవారం సాయంత్రం ఇంటి వద్ద గల రేకుల షెడ్డులో ఉన్న కాంప్లెక్స్ మందు బస్తాలు తీస్తుండగా.. బస్తాల సందులో ఉన్న నాగుపాము కాటు వేసింది. చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య పద్మ, కొడుకు, కూతురున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- కోతులు పంట ధ్వంసం చేశాయన్న మనోవేదన
- కుటుంబ కలహాలతో ప్రాణాలు తీసుకున్న రైతు


యాదగిరి(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): కుటుంబాన్ని పోషించేందుకు చేసిన అప్పులు ఒకవైపు.. చేతికొచ్చిన మొక్కజొన్న పంటను కోతులు నాశనం చేశాయన్న బాధ మరోవైపు ఉండగా ఇంట్లో తలెత్తిన కలహాలకు ఓ రైతు బలయ్యాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలు. మండలంలోని బందనకల్‌కు చెందిన చింతల యాదగిరి(42)కి గ్రామశివారులో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వరి, మొక్కజొన్న సాగుచేస్తున్నాడు. కుటుంబ పోషణకు గతంలో అప్పులు చేశాడు. వారం క్రితం మొక్కజొన్న పంటను కోతులు ధ్వంసం చేశాయి. దీంతో యాదగిరి కుటుంబంలో కలహాలు వచ్చాయి. తీవ్ర మనోవేదనకు గురై బుధవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి చేనులోనే పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు అపస్మారక స్థితిలో ఉన్న యాదగిరిని ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య శారద, కుమారులు శేఖర్, పవన్, కూతురు శ్రావణి ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### నగదు పట్టివేత

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నికల తనిఖీలో రూ.1.66లక్షలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి స్టేషన్ పరిధిలోని మేడిపల్లి సెంటర్‌లో రోజువారీ తనిఖీల్లో గోదావరిఖనికి చెందిన భాస్కర్ వద్ద రూ.1.66లక్షలను ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. విచారణ నిమిత్తం స్టాటిక్ సర్వేలెన్స్ టీంకు అందించారు.

### గుంటూరులో 5న మేజిక్ ఫెస్టివల్

కోల్‌సిటీ(రామగుండం): గుంటూరులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో నవంబర్ 5న అమరావతి మేజిక్ ఫెస్టివల్ పేరుతో ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్ 39వ ఇంద్రజాల మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాధ్యుడు మేజిక్ రాజా తెలిపారు. డీలర్స్ డెమాన్‌స్ట్రేషన్, జూనియర్స్, సీనియర్స్‌కు స్టేజి మేజిక్ కాంపిటీషన్స్‌తో పాటు మేజిక్ ట్రిక్స్ టీచింగ్ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇంద్రజాల రంగానికి విశిష్ట సేవలందించిన సీనియర్ ఇంద్రజాలికులను విశిష్ట ఇంద్రజాలికుడు, జాదూరత్న, ప్రతిభ గల యువ ఇంద్రజాలికులను ఇంద్రజాలతేజం అవార్డులతో సత్కరిస్తారని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 200మందికి పైగా మెజీషియన్స్ హాజరయ్యే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 28 లోగా తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆసక్తి ఉన్నవారు 94906 39764, 98669 44569 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# మూడు జిల్లాల మానకొండూర్

- 2009లో నియోజకవర్గం ఆవిర్భావం
- బరిలో పాతకాపులే.. ప్రధాన పార్టీల మధ్యే పోటీ
- తొలిసారి ఆరెపల్లి, రెండుసార్లు రసమయి విజయం
- మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనున్న 'కవ్వంపల్లి'!




| సంవత్సరం | అభ్యర్థి | పోలైన ఓట్లు | ప్రత్యర్థి | పోలైన ఓట్లు |
|---|---|---|---|---|
| 2009 | ఆరెపల్లి మోహన్ (కాంగ్రెస్) | 45,304 | ఓరుగంటి ఆనంద్(టీఆర్ఎస్) | 43,132 |
| 2014 | రసమయి బాలకిషన్ (టీఆర్ఎస్) | 85,010 | ఆరెపల్లి మోహన్(కాంగ్రెస్) | 38,088 |
| 2018 | రసమయి బాలకిషన్(టీఆర్ఎస్) | 88,997 | ఆరెపల్లి మోహన్(కాంగ్రెస్) | 57488 |

**ఓటర్ల వివరాలు**

| పోలింగ్ బూత్‌లు | పురుషులు | స్త్రీలు | థర్డ్ జండర్ | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|
| 316 | 1,07,371 | 1,11,041 | 1 | 2,18,413 |

మానకొండూర్: డీలిమిటేషన్‌లో భాగంగా 2009లో నేరెల్ల, ఇందుర్తి, కమలాపూర్, హుజూరాబాద్, కరీంనగర్ మండలాల్లోని పలు గ్రామాలతో మానకొండూర్ నియోజకవర్గం ఏర్పడింది. ప్రస్తుతం సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్ మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉంది. ఇప్పటివరకు మూడుసార్లు ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగగా, తొలిసారి కాంగ్రెస్, త ర్వాత రెండుసార్లు టీఆర్ఎస్ విజయం సాధించా యి. నాలుగోసారి సైతం పాత కాపులే ఎన్నికల బ రిలో దిగనున్నారు. ప్రతిసారీ గట్టి పోటీ ఉంటోంది.

**జలవనరులు పుష్కలం..**

నియోజకవర్గంలో జలవనరులు పుష్కలంగా ఉన్నాయి. ఇల్లంతకుంట మండలంలోని అనంతసాగర్(అన్నపూర్ణ) ప్రాజెక్టు ద్వారా ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాలకు సాగునీరు అందుతోంది. మిడ్‌మానేరు, దిగువ మానేరు, తోటపల్లి, కల్వల రిజర్వాయర్ల ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగు నీరు వెళ్తోంది. కరీంనగర్ జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా ఈ నియోజవర్గంలో ప్రాజెక్టులు ఉన్నాయి. ఒకప్పుడు ఏడారిగా ఉన్న ఇల్లంతకుంట, బెజ్జంకి, గన్నేరువరం మండలాలు నేడు నీటితో కళకళలాడుతున్నాయి. అలాగే, తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లోని మెట్ట ప్రాంతానికి ఈ ప్రాజెక్టులతో సాగు నీరు అందుతుండటంతో నియోజకవర్గం పాడి పంటలతో విలసిల్లుతోంది. ఇంజినీరింగ్ తదితర కళాశాలలతో విద్యార్థులకు ఉన్నత చదువులు అందుబాటులోకి వచ్చాయి. వరి సీడ్ పాంట్లు జిల్లాలోనే మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో అధికంగా ఉన్నాయి.

**రెండుసార్లు రసమయిదే విజయం**

2009లో కాంగ్రెస్ తరఫున ఆరెపల్లి మోహన్, టీఆర్ఎస్ తరఫున ఓరుగంటి ఆనంద్, పీఆర్పీ అభ్యర్థిగా కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్నికల బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి టీఆర్ఎస్ అభ్యర్థిపై విజయం సాధించారు. 2014లో టీఆర్ఎస్ నుంచి రసమయి బాలకిషన్, కాంగ్రెస్ నుంచి ఆరెపల్లి మోహన్, టీడీపీ నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ పోటీలో ఉన్నారు. టీఆర్ఎస్ అభ్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు. 2018లో టీఆర్ఎస్ నుంచి రసమయి బాలకిషన్, కాంగ్రెస్ నుంచి ఆరెపల్లి మోహన్ పోటీ పడ్డారు. ఈ ఎన్నికలు నువ్వా నేనా అన్నట్లు సాగగా రసమయి రెండోసారీ గెలిచారు. 2009లో పీఆర్పీ తరఫున, 2014లో టీడీపీ తరఫున పోటీ చేసిన కవ్వంపల్లి సత్యనారాయణ గట్టి పోటీ ఇచ్చి, ఓటమిపాలయ్యారు. 2018లో టీడీపీ, కాంగ్రెస్ పొత్తులో భాగంగా మానకొండూర్ సీటు కాంగ్రెస్‌కు కేటాయించడంతో సత్యనారాయణ ఆ పార్టీకి మద్దతు తెలిపారు.

**'ఆరెపల్లి' ఈసారి బీజేపీ నుంచి!**

మొదటినుంచీ కాంగ్రెస్‌లో ఉన్న ఆరెపల్లి మోహన్ గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం బీజేపీలో చేరి, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే, డాక్టర్ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన కవ్వంపల్లి సత్యనారాయణ 2009కి ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ నుంచి టికెట్ రాకపోవడంతో పీఆర్పీ నుంచి పోటీ చేసి, ఓటమి చెందాడు. ఆ తర్వాత 2014లో టీడీపీ నుంచి పోటీ చేసినా ఓడిపోయారు. తదనంతర రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి, మూడోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు కవ్వంపల్లి సత్యనారాయణ.

**కాంగ్రెస్ నుంచి 'కవ్వంపల్లి'**

కవ్వంపల్లి సత్యనారాయణ 2009లో పీఆర్పీ తరఫున పోటీ చేసి, 34,430 ఓట్లు, 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి, 23,627 ఓట్లు సాధించారు. 2018లో పోటీ చేయలేదు. ఈసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేయనున్నారు.

# రోడ్డు ఎత్తు తగ్గించండి

- వర్షాకాలం వస్తే ఇళ్లు మునిగే ప్రమాదం
- కలెక్టర్‌కు ఫిర్యాదు


కాంట్రాక్టర్‌తో కాలనీవాసుల వాగ్వాదం

సుల్తానాబాద్: రోడ్డు ఎత్తుగా వేయడంతో వర్షాకాలంలో ఇళ్లు మునిగే ప్రమాదముందని, ఎత్తును తగ్గించాలని కాలనీవాసులు గురువారం కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డు టెండర్ కైవసం చేసుకున్న కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా చేస్తున్నారు. ఇళ్ల మధ్య ఇరువైపులా ఎత్తు బాగా పెరిగిందని, దీంతో ప్రస్తుత కాలంలోనే వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసుల అనుమతి లేకుండా నిర్మాణం చేయడం ఏమిటని ప్రశ్నించారు. గత వర్షాకాలంలోనే పలు ఇళ్లలోకి నీళ్లు వచ్చి చేరాయని, రోడ్డు ఎత్తు వేయడంతో కాలనీ మునిగిపోయే ప్రమాదముందని, కాంట్రాక్టర్లు, అధికారులు చొరవ తీసుకొని ఎత్తు తగ్గించాలని కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. పోలీసులు చేరుకొని కాలనీవాసులను శాంతింపజేశారు. కాంట్రాక్టర్ అజయ్‌రావు మాత్రం నిబంధన ప్రకారం పనులు చేస్తున్నామని వివరించారు. కాలనీవాసులు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. రోడ్లు భవనాల శాఖ డీఈ రాములుకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని సూచించినట్లు కాలనీవాసులు తెలిపారు.

# ప్రతీ వాహనం తనిఖీ చేయాలి

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్


రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మంథని: చెక్‌పోస్టుల వద్ద ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. గురువారం మంథని మండలం ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. చెక్ పోస్ట్ వద్ద అధికారులు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. తనిఖీల్లో నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు తప్పకుండా పాటించాలని సూచించారు. జప్తు చేసిన నగదును రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత వ్యక్తులకు రసీదు అందజేయాలన్నారు. చెక్ పోస్ట్ వద్ద సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, షిఫ్టుల విధానంలో అధికారులు విధులు నిర్వహించాలన్నారు. పోలీస్ అధికారులు, స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. మంథని రిటర్నింగ్ అధికారి హనుమానాయక్, తహసీల్దార్ రాజయ్య, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగం.. గ్యాస్ ఆధారిత క్రిమిటోరియం


గ్యాస్ ఆధారిత దహనవాటిక షెడ్డు


నిరుయోగంగా గ్యాస్ ఆధారిత దహనవాటిక

- గతేడాది వరదతో పూర్తిగా మునిగిన దహనవాటిక
- ప్రారంభం కాకుండానే పనికి రాకుండా పోయిన వైనం
- పట్టని పాలకులు, బల్దియా అధికారులు

కోల్‌సిటీ(రామగుండం): ఒకవైపు పట్టణాల్లో శ్మశానవాటికలకు స్థలాభావ సమస్యలు.. మరోవైపు శ్మశానవాటికకు సగటున రోజుకు ఐదారు శవాలకు తగ్గకుండా దహన సంస్కారాలకు వస్తుండడంతో ఆ ప్రక్రియ ఆలస్యమవుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం గ్యాస్ ఆధారిత దహనవాటికలు(క్రిమిటోరియం) నిర్మించాలని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను ఆదేశించింది. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని హిందూ శ్మశానవాటికలో నాలుగేళ్ల క్రితం గ్యాస్ ఆధారిత దహనవాటిక(క్రిమిటోరియం) నిర్మించి ట్రయల్ రన్ పూర్తి చేసినా.. అది పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు. గతేడాది వచ్చిన భారీ వర్షాలతో పెరిగిన గోదావరి వరద తీవ్రతకు గ్యాస్ ఆధారిత దహనవాటిక పూర్తిగా మునిగిపోయింది. అందులోని ముఖ్యమైన విడి భాగాలు పనికి రాకుండా పోయాయని తెలుస్తోంది. ఈ క్రిమిటోరియం దుస్థితిని కన్నెత్తి చూసిన నాథుడు లేడు.

**రూ.20లక్షలతో..**

కట్టెలకు బదులు గ్యాస్ ఆధారిత దహనవాటిక(క్రిమిటోరియం) ఉపయోగించాలని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2017లో అప్పటి జిల్లా కలెక్టర్ చొరవతో హిందూ శ్మశానవాటికలో గ్యాస్ ఆధారిత దహనవాటిక ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. రాజమండ్రిలోని ఓ సంస్థకు నిర్మాణ పనులు అప్పగించారు. రూ.20లక్షల నిధులను వెచ్చించి శ్మశానవాటికలో ప్రత్యేక షెడ్డును నిర్మించారు. ఈ షెడ్డులోనే సదరు సంస్థ గ్యాస్ ఆధారిత దహనవాటిక యంత్రాలను అమర్చారు. నాలుగేళ్ల క్రితం ట్రయల్ రన్ కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం వినియోగంలోకి రాకముందే ఇది మూలన పడింది.

### సంబంధిత కంపెనీ ప్రతినిధులను పిలిపిస్తాం



గ్యాస్ ఆధారిత దహనవాటిక వినియోగించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. దహన వాటిక నిర్మించిన కంపెనీ ప్రతినిధులను పిలిపిస్తాం. వినియోగంలోకి తీసుకురావడానికి దహనవాటికలోని యంత్రాలు, మోటార్ల పనితీరు పరిశీలిస్తాం.

– సీహెచ్ నాగేశ్వర్, కమిషనర్, నగరపాలక సంస్థ

**కాల్చే సమయం.. కట్టెలూ తక్కువే..**

మృతదేహాన్ని కట్టెల మీద కాల్చడానికి సుమారు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల కట్టెలు అవసరం కాగా.. పూర్తిగా కాలడానికి రెండు రోజులు పడుతుంది. కానీ ఈ గ్యాస్ ఆధారిత దహనవాటిక ద్వారా ఒక్కో మృతదేహం దహనం కావడానికి కేవలం 50 నుంచి 90 నిమిషాలు పడుతుంది. క్వింటాల్ కట్టెలు మాత్రమే సరిపోతాయి. ఇలాంటి గ్యాస్ ఆధారిత దహనవాటికను వినియోగంలోకి తేకుండా అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**వరదతో మునిగిన శ్మశానవాటిక**

గతేడాది కురిసిన భారీ వర్షాలతో హిందూ శ్మశానవాటిక పూర్తిగా మునిగిపోయింది. దీంతో గ్యాస్ ఆధారిత దహనవాటిక కూడా వరద నీటితో మునిగిపోవడంతో.. దహనవాటికలోని గ్యాస్ ఆధారిత మోటార్లు నీటిలో మునిగిపోయాయి. మోటార్ల పనితనంపై అధికారులు ఇప్పటివరకు దృష్టి సారించలేదు. మోటార్లలోని కీలక విడి భాగాలు వరద నీటిలో మునిగిపోవడంతో అవి చెడిపోయి ఉంటాయని భావిస్తున్నారు.



## బొగ్గుయి వార్తలు

### నిర్దేశిత లక్ష్యాలు సాధిస్తేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్

- ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్


గనిలోకి దిగేందుకు వెళ్తున్న రక్షణ బృందం

గోదావరిఖని: రక్షణతో ముందుకు సాగుతూ నిర్దేశిత లక్ష్యాలు సాధిస్తేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జీడీకే–1, 3 గనిలో 54వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. చేసే పనిలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుందన్నారు. అవగాహనతో పనులు చేసి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. రక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం రక్షణ కమిటీ సభ్యులు గనిలోని పని స్థలాల్లోకి వెళ్లి రక్షణకు సంబంధించిన అంశాలపై పరిశీలించారు. కార్పొరేట్ ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ జీఎం జి.నాగేశ్వర్‌రావు, రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఏరియా ఇంజినీర్ రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలకు సింగరేణి ప్రోత్సాహం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జీఎం

రామగిరి: సింగరేణి సంస్థ క్రీడలను ప్రోత్సహిస్తోందని ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. గురువారం ఆర్జీ–3, ఏపీఏ ఏరియా కంపెనీ స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతోందన్నారు. అనంతరం ఆయా క్రీడల కెప్టెన్లతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎంలు రఘుపతి, డి.ఖైధ్య, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డీవైపీఎం గుర్రం శ్రీహరి, గౌరవ కార్యదర్శి సునీల్ ప్రసాద్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ పర్ష శ్రీనివాస్, అసిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, కోఆర్డినేటర్ బి.వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### రైతుబంధు ఆపాలన్న రైతు ద్రోహి కాంగ్రెస్

- బీఆర్ఎస్ రామగుండం ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు


మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణరావు

యైటింక్లయిన్‌కాలనీ: తెలంగాణ రైతులకు రైతుబంధు పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సాయం తక్షణమే నిలిపేయాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరడం రైతు ద్రోహ చర్య అని బీఆర్ఎస్ రామగుండం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు అన్నారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులను ప్రోత్సహించడానికి, వారి ఆత్మహత్యలను ఆపడానికి రైతుబంధు పేరిట చేస్తున్న ఆర్థిక సాయాన్ని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. నాయకులు బీపీ రామస్వామి, మాదాసి రామమూర్తి, టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్, రాజిరెడ్డి, రవీందర్, సుధాకర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక హక్కులు సాధించిన ఘనత బీఆర్ఎస్‌దే..

- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య


మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కోల్ ఇండియాలో లేని హక్కులను కార్మికులకు సాధించి పెట్టిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కిందని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య అన్నారు. గురువారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అండతో కార్మికులకు యూనిఫాం, వారసత్వ ఉద్యోగాలు, క్వార్టర్లకు ఏసీ సౌకర్యం, రూ.10లక్షల వడ్డీ లేని రుణాలు అందించామన్నారు. సింగరేణి సంస్థలో అంతర్గత ఉద్యోగాలు కల్పించారని అన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేల సహకారంతో సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. సింగరేణి కార్మికుల అండతో మూడోసారి గెలిపించి హ్యాట్రిక్ సీఎంగా నిలపాలని కోరారు. కార్మిక లోకమంతా కోరుకంటి చందర్ వెంటే ఉందని, ఉద్యమ నాయకున్ని గెలిపించుకోవాలన్నారు. యూనియన్ నాయకులు నూనె కొమురయ్య, మాదాసు రాంమ్మూర్తి, మండల రమేష్, శేషగిరి, పర్లపల్లి రవి, తోడేటి శంకర్‌గౌడ్, మూల విజయారెడ్డి, వడ్డేపల్లి శంకర్, దాసరి శ్రీనివాస్, నిట్టూరి రాజు, బెంద్రం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక సమస్యలు పరిష్కరించాలి


జనార్దన్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

రామగిరి: ఏపీఏ గనిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం మేనేజర్ జనార్దన్‌కు సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. 59, 91 లెవల్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికులు వెంటిలేటర్, ప్లేడే, ఇన్సెంటీవ్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రటరీ దొమ్మటి కొంరయ్య, పిట్ కార్యదర్శి రవికుమార్, నాయకులు వేణుగోపాల్, సదానందం, ఆశోక్, సురేందర్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

### డిస్పెన్సరీ తనిఖీ చేసిన ఆర్జీ–3 జీఎం


బెడ్లను పరిశీలించిన సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3 డివిజన్ పరిధిలోని సెంటనరీకాలనీ డిస్పెన్సరీని గురువారం జీఎం సుధాకర్‌రావు తనిఖీ చేశారు. డిస్పెన్సరీకి వచ్చిన ఉద్యోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డిస్పెన్సరీకి వస్తున్న ఉద్యోగులకు సరైన సేవలు అందుతున్నాయా.. ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులకు సరైన వైద్య సేవలందించాలని, నవంబర్ 2న నిర్వహించనున్న 54వ భద్రత పక్షోత్సవాలలో భాగంగా డిస్పెన్సరీలో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సి.హెచ్.వెంకటరమణ, సివిల్ డీజీఎం పద్మరాజు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, సీనియర్ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### తవ్వి వదిలేశారు



మిషన్ భగీరథ లీకేజీతో నీరు ఉబికి వచ్చి రోడ్డంతా బురదమయమైంది. మరమ్మతు కోసం మున్సిపాలిటీ సిబ్బంది వాల్ వద్ద గుంతను తవ్వి లీకేజీ సరిచేశారు. అయితే నడిరోడ్డుపై గుంత తవ్వి పది రోజులు గడుస్తున్నా పూడ్చలేదు. గుంతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రాత్రి వేళ వాహనదారులు పడిన సందర్భాలు ఉన్నాయంటున్నారు స్థానికులు. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి